క్లుప్తంగా

ఘనంగా గండి అంజన్న గ్రామోత్సవం

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి గ్రామోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈవేడుక నిర్వహించినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ఆలయ ప్రధాన ఉపప్రధాన ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు. గండి పురవీధులతో పాటు వీరన్నగట్టుపల్లెలో ఊరేగింపు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఆర్కేవ్యాలీ పోలీసులు బందోబస్తు నిర్వహించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్‌లు వెంకటస్వామి, వీరభాస్కరుడు, భక్తులు పాల్గొన్నారు

రైతుకుటుంబానికి ఎంపీ పరామర్శ


రైతుకుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల : ధైర్యంగా ఉండాలని.. అన్ని విధాల అండా ఉంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రైతు కుటుంబానికి ఆయన భరోసా ఇచ్చారు. మండలంలోని పెద్దజూటూరు గ్రామానికి చెందిన కదిరి జనార్ధన్‌రెడ్డి అనే రైతు ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ బయపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ మరకాకృష్ణారెడ్డిలతో కలిసి మంగళవారం పెద్దజూటూరు గ్రామానికి చెరుకుని రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్యగల కారాణాలపై ఆరా తీశారు. ఎలాంటి ఆందోళన పెట్టుకోవద్దని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నివాళి


లక్ష్మీదేవమ్మ (ఫైల్)

చక్రాయపేట : మండలంలోని చిలేకాంపల్లె గ్రామ మాజీ సర్పంచ్ బెల్లం లక్ష్మీదేవమ్మకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బుధవారం నివాళులు అర్పించారు. లక్ష్మీదేవమ్మ మంగళవారం మృతి చెందారు. మృతురాలు కుమారుడు బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రస్తుతం చక్రా యపేట వైఎస్ ఆర్‌సీపీ మండల అధ్యక్షుడిగా ఉన్నారు. కోడలు వర్ధన చిలేకాంపల్లె ఎంపీటీసీ సభ్యురాలుగా ఉన్నారు. లక్ష్మీదేవమ్మ ప్రస్తుతం చిలేకాంపల్లె గ్రామ ఉప సర్పంచ్‌గా ఉన్నారు. ఎంపీతో పాటు లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, వేంపల్లెకు చెందిన వైఎస్ ఆర్‌సీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గ జనరల్ సెక్రటరీ ఈశ్వరరెడ్డి, ఉమ్మడి కడప జిల్లాలోని పలు మండలాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు ఆమెకు నివాళులు అర్పించారు

పరామర్శ

సింహాద్రిపురం : మండలంలోని కసునూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొమ్మా రఘునాథ్‌రెడ్డిని మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల ఆయనకు కాలు విరగడంతో చికిత్స చేయించుకుని ఇంటికి రావడం జరిగింది. ఈవిషయం తెలుసుకున్న ఎంపీ కసునూరు గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న లక్ష్మీనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామంలో కల్లూరు లక్ష్మీనారాయణరెడ్డి 40వ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని నిరుపేదలకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ రోజు ఆయన కుమారులు పంపిణీ చేస్తారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు, ఎంపీటీసీ లక్ష్మీరామాంజనమ్మ, ఉప సర్పంచ్ చంద్ర ఓబుల్‌రెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంగిరెడ్డి, స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం మరక సంక్రాంతి రోజున శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ్వస్వామి కల్యాణం ఆలయ ఈఓ శ్రీనువాసులు, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకాలకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పుత్రా క్రిష్ణ చైతన్యరెడ్డి పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కన్నులారా తిలకించారు. అనంతరంగ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

కమలాపురం : మండల పరిధిలోని కమలాపురం, కె.అప్పాయపల్లె, గంగవరం, విభరాపురం, సంబటూరు, కోగటం, పందిళ్లపల్లె, రాజుపాళెం, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, దేవరాజుపల్లె, కొండాయపల్లె తదితర గ్రామాలలో మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు, నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇల్లు బంధువులతో కలకల లాడింది. ప్రతి ఇంట పిండివంటలు చేసి బంధువులు, సన్నిహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. అల్లుళ్లు అత్త గారిండ్లకు చేరుకున్నారు. మహిళలు మూడు రోజుల పాటు రంగ వల్లులు వేస్తూ, పిండి వంటలు చేస్తూ బిజీ బిజీగా కనిపించారు. మాంసం, మద్యం దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. పలు గ్రామాల్లో వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మూడు రోజుల సంక్రాంతి సంబరాలు ఘనంగా ముగిసాయి. అలాగే టి.చదిపిరాళ్ల గ్రామంలో బుధవారం స్వాముల వారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా చివరి రోజు కనుమ పండుగను పురస్కరించుకొని స్థానిక వేణుగోపాల స్వామి దేవస్థానం నుంచి గ్రామ శివారు వరకు గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చుతూ, డప్పు వాయిద్యాల మధ్య యువత వివిధ రకాల నృత్యాలు చేశారు. అనంతరం పారువేట కోలాహలంగా నిర్వహించారు. గ్రామ ప్రజల సమక్షంలో గొళ్లపల్లె వంక వద్ద కుందేలును పారువేటకు వదిలారు. పట్టుకున్న వారికి నగదు బహుమతులు అందజేశారు. అలాగే కమలాపురం–ఖాజీపేట ప్రధాన రహదారిలో పాగేరు వంక వద్ద కనుమ పండుగ పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన పారువేట ఉత్సవం జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నీలం నరేంద్ర, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కబడ్డీ, బండ లాగుడు పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు, లెమన్ స్పూన్ తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే కంచి వరదరాజ స్వామి వారిని ఆలయం నుంచి పాగేరు వంక వరకు ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా స్వామి వారిని తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి 7 జతల కాండ్లు వచ్చాయి. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అతిథుల చేతుల మీదుగా అందజేశారు.


ఎర్రగుంట్ల : పార్వేట ఉత్సవంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ ఆంజనేయస్వామి

పులివెందులలో..

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లె, తుమ్మలపల్లె, రాగిమానుపల్లె, కొత్తపల్లె, యర్రబల్లె, కనంపల్లె, ఎర్రిపల్లె, మర్రబల్లె గ్రామాలలో సంక్రాంతి, కనుమ వేడుకలను పిల్లలు, పెద్దలు సంతోషంగా జరుపుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈవేడుకలో కోడి పందేలు, టెంకాయ పందేలు జోరుగా సాగాయి. లింగాల మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో సంక్రాంతి పండుగ, కనుమ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలలో ఇళ్ల ముంగిట్లో ముత్యాలు, రంగులతో ముగ్గులు వేసి సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండల వ్యాప్తంగా మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఆరుగాలం శ్రమించే రైతన్న పంట ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులంతా ఒక చోటికి చేరుకుని పండుగను ఘణంగా నిర్వహించుకున్నారు. స్థానిక మెయిన్ బజారులోని ఆంజనేయస్వామికి మాజీ ఎంపీటీసీ కురాకుల వెంకటేష్, ఓబులమ్మ దంపతులు వడమాల పూజ నిర్వహించారు. పాపాఘ్ని నది తీరాన చిన్నపిల్లలు గాలిపటాలు ఎగురవేశారు. ఎద్దుల కొండపై ఉత్సవ మూర్తులను గ్రామ పురవీదులలో ఊరేగించారు. గ్రామోత్సం వెంట కవి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమి విద్యార్థులచే హరిదాసు డూడూ బసవన్నల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే చింతలమడుగుపల్లె గ్రామంలో చిన్న ఓబుళరెడ్డి, నల్లమేకల రామాంజనేయులు ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. అలాగే స్థానిక బలిజ సంఘం వీధిలో బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, వైఎస్ ఆర్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాచినేని వేణుగోపాల్‌లు విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బలిజసంఘం గౌరవ అధ్యక్షులు కొత్తూరు రెడ్డెయ్య, రంగయ్య, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలో సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముంగిట ముగ్గులు వేశారు. చిన్న పిల్లలు గాలిపటాలు, కబడ్డీ, ఖోఖో, వాలిబాల్, పాటలకచేరివంటి ఆటలతో అడుకుంటు కేరింతలు కొట్టారు. బంధువులతో ఇళ్లన్ని సందడిగా మారాయి. వెయ్యినూతలకోన క్షేత్రంలో మరక సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆలయ ధర్మ కర్త నరసింహ హరిప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం, రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని మహిళలు తమ ఇంటిముందర ముగ్గులు వేసి సంక్రాంతి శోభను తెచ్చారు. పలు గ్రామాలలో ముగ్గుల పోటీలు, ఆటల పాటలతో సంతోషంగా గడిపారు. చింతకొమ్మదిన్నె, బయనపల్లె, క్రిష్ణాపురం పలు గ్రామాలలో ధనుర్మాసం మొదటి నుండి గౌరమ్మకు పూజలు మొదలు పెట్టిన మహిళలు కనుమ పండుగ రోజున ముగింపుగా గౌరమ్మకు ఘనంగా పూజలు నిర్వహించి గంగమ్మ ఒడికి చేర్చి వీడ్కోలు పలికారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా ఇళ్ల ముందు అందమైన ముగ్గులు వేయడంతోపాటు వాటిలో గొబ్బిలు పెట్టి వాటిపై చెండుమల్లె పూలు పెట్టి అలంకరించారు. గ్రామీణ ప్రాంతాలలో వివిధ రకాల పోటీలను నిర్వహించి గెలుపొందిన పిల్లలకు బహుమతులను అందజేశారు. పతంగేరామన్నరావు ఆటస్థలంలో విద్యార్థులు గాలిపటాలను ఎగురవేసి ఆనందించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్లలో పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో పట్టణంలోనే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వేలాది జనాలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలోని నడివూరులోని శ్రీ రామాలయ దేవాలయం నుంచి శ్రీ ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహంను ఊరేగింపుగా నిర్వహించారు. కడప రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవంలో చెక్కభజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో బోగి, సంక్రాంతి, కనుమ వేడుకలను మూడు రోజుల పాటు పెద్దలు, పిల్లలు సంతోషంగా జరుపుకున్నారు. బిదినంచర్ల గ్రామంలో పండుగను పురష్కరించుకుని ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.


కమలాపురం : చదిపిరాళ్లలో జరిగిన ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


కమలాపురం : ముగ్గులు వేస్తున్న యువతులు


కమలాపురం : కబడ్డీ ఆడుతున్న యువకులు


వేంపల్లె : అలరిస్తున్న డూడూ బసవన్నల నృత్యాలు


చింతలమడుగుపల్లెలో బండలాగుడు పోటీలు


వెయ్యినూతలకోనలో నరసింహస్వామి లక్ష్మీదేవి అమ్మవారికి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


చింతకొమ్మదిన్నె : గౌరమ్మ ఊరేగింపులో కోలాటం చేస్తున్న బాలికలు


జమ్మలమడుగు : ముగ్గులు వేస్తున్న యువతులు


ఎర్రగుంట్లలో పార్వేట ఉత్సవంలో అలరించిన కోలాటం


సింహాద్రిపురంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట,ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

శిల్పారామంలో సంక్రాంతి వేడుకలు


శాస్త్రీయ నృత్యంలో చిన్నారులు

పులివెందుల టౌన్ : కనుమ పండుగ రోజు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. జె.సాయివెంకట రవితేజ, సాయి ఆక్వా బోటింగ్ వారి సహకారంతో డ్యాన్స్ మాస్టర్ రాజా, శ్రీ రాజా కళా నిలయం ఆధ్వర్యంలో చిన్నారులు సాంప్రదాయ నృత్యాలతో ప్రేక్షకులను అక్కట్టుకున్నారు. అలాగే ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. వైఎస్‌ఆర్ ఉల్లిమెళ్ల లేక్ ఫ్రంట్‌లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆఖరి రోజు చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె కళాతరంగని సంస్థ మాస్టర్ రాజేష్ బాబు నిర్వహించిన నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ బి.వరప్రసాద్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.


వైఎస్సార్ లేక్ ఫ్రట్‌లో నృత్యప్రదర్శనలో పాల్గొన్న మాస్టర్

ఎంపీకి సన్మానం

పులివెందుల రూరల్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని బుధవారం భాకరాపురంలోని ఆయన నివాసంలో మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అజ్జుగుట్టు భాస్కర్‌రెడ్డి సన్మానించారు. మండల కన్వనర్‌గా ఎంపిక చేసినందుకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు ఎంపీ చేతుల మీదుగా క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామమల్లేశ్వరరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీని సన్మానిస్తున్న మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, వైఎసాస్సార్ సీపీ నాయకులు

చినుకు రాలినా.. పంట నష్టమే

పెద్దముడియం : అనుకోకుండా వాతావరణంలో స్వల్ప మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరి, మినుము కోతలు పూర్తవ్వడంతో ఆ రైతులకు ఇబ్బంది లేదు. జొన్న కోతలు మెదలయ్యాయి, చిన్నపాటి వర్షం కురిసినా గింజలు నల్లగా మారతాయి. ప్రస్తుతం శనిగ పంట పూత, పొందె దశలో ఉండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. రెండు నిమిషాలు పాటు జల్లులు కురిసినా పూతంతా వాడిపోయి పంట దిగుబడులు రావని కలవర పడుతున్నారు. ఇప్పటికే చాలా వరకు మొగిలి, మంచు కారణంగా పంట దెబ్బతినింది. కొద్దిరోజుల నుంచి వర్షం కురవకపోయినా మేఘాలు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


పెద్దపసుపుల గ్రామంలో పూతదశలో ఉన్న శనిగ పంట

బాల సాహిత్యం విజ్ఞానానికి సోపానం

ప్రొద్దుటూరు : బాల సాహిత్యం విజ్ఞానానికి సోపానమని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య తెలిపారు. స్థానిక తొగటవీరక్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం తెలుగు భాషోపాధ్యాయుడు పల్లా వెంకటరామారావు రచించిన 'చిట్టి చేతులు' బాలల కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ బాలల కథలు పిల్లలకు ప్రపంచ జ్ఞానాన్ని, మంచి చెడు విచక్షణ జ్ఞానాన్ని అందిస్తాయని తెలిపారు. బాలల కోసం పల్లా రామారావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సభ అధ్యక్షుడు ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి మాట్లాడుతూ పిల్లల కథలు పిల్లల్లో నైతిక విలువల అభివృద్ధికి, సమాజం పట్ల అవగాహనకు, మంచి నడవడికకు సోపానాలుగా నిలుస్తాయన్నారు. పుస్తక రచయిత పల్లా వెంకటరామారావు మాట్లాడుతూ నేటి తరం పిల్లలు బాల సాహిత్యాన్ని చదవాల్సిన ఆవశ్యకత ఉదన్నారు. నేటి కంప్యూటర్ యుగంలో పిల్లల్లో సృజనాత్మక శక్తి అలవడాలంటే కథా పఠనం ఒక్కటే మార్గమన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు మాట్లాడుతూ పిల్లలతో బాల సాహిత్యం చదివించడం ద్వారా వారిలో అనేక సుగుణాలను కల్గించవచ్చన్నారు. కవి ఏపీ దస్తగిరి మాట్లాడుతూ పిల్లలను దేశాభ్యున్నతికి అనుకూలంగా తీర్చిదిద్దడంలో బాల సాహిత్యం ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. రచయిత కొమ్మిశెట్టి మోహన్, కవి కాశీవరపు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ చిట్టి చేతులు పుస్తకంలోని కథలు సరళంగా పిల్లలను ఆకర్షించే విధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

పంటలకు అడవి పందుల బెడద

- వేల ఎకరాలలో దెబ్బతింటున్న పంటలు
- ఆందోళనలో రైతులు

వేముల : రబీ పంటలపై పందుల దాడి ఎక్కువగా ఉంటోంది. రాత్రివేళల్లో పంటలపై పడి నాశనం చేస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా రబీలో వేలాది ఎకరాలలో శనగ, మినుము పంటలను రైతులు సాగు చేసుకున్నారు. పంట విత్తనం వేసిన మొదలు దిగుబడులు అందేవరకు పంటలలో పందుల బెడద ఉంటోంది. రబీలో ప్రధాన పంటలు శనగ, మినుము. ప్రస్తుత శనగ పంట కొన్ని చోట్ల బుడ్డలు ఉండగా, మరికొన్ని చోట్ల పూత, పిందె దశలో ఉంది. ఈ దశలో పంటచేలలో పంటలపై పందులు దాడి చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాత్రివేళల్లో పంటలను నాశనం చేస్తున్న పందులు

రాత్రివేళల్లో ఎక్కువగా పందులు పంటలపై పడి నాశనం చేస్తున్నాయి. పొలాలకు సమీపంలోని గుట్టలు, వాగులు, వంకలు, ముళ్ల పొదలలో అడవి పందులు నివాసం ఏర్పరుచుకున్నాయి. పగలు స్థావరాల్లోనే ఉంటూ రాత్రి సమయాలలో పంటలపై పడుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో పగలు కూడా పంటలను పందులు తొక్కి పడేస్తున్నాయి. పంటలపై పందులు రాకుండా చేయాలంటే రైతులకు సాధ్యం కావడంలేదు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసే పందుల బెడద నుంచి పంటలను కాపాడుకోలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. రబీ పంటల సాగులో దిగుబడులు అందాలంటే మూడు నెలల సమయం పడుతుంది. అప్పటివరకు పంటల సంరక్షణ రైతులకు బారంగా మారుతోంది.


పగలే శనగ పంటలో పడి తినేస్తున్న పందులు

వేల ఎకరాలలో పంటలు సాగు.. :

నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది ఎకరాలలో రబీలో పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది రబీలో 50వేల నుంచి 60వేల ఎకరాలలో మినుము, శనగ పంటలను సాగు చేసుకున్నట్లు అంచనా, పందుల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు పొలాల గట్ల వెంబడి మనుషుల దిష్టి బొమ్మలను ఏర్పాటు చేస్తున్నారు. మరికొంతమంది రాత్రివేళల్లో పొలాల వద్దకు వెళ్లి పందులు పంటల వద్దకు రాకుండా టపాసులు పేలుస్తూ భయపెడుతున్నారు. ఎన్నిపాట్లు పడినా తెల్లారే లోపు పంటలపై పందులు దాడి చేసి నష్టపరుస్తున్నాయి. మినుము పంటలో దిగుబడులు వస్తుండగా.. శనగ పంటలో దిగుబడులు మరో నెల రోజుల సమయం పడుతోంది. అంతవరకు పంటను ఎలా కాపాడుకోవాలనే రైతులలో దిగులు నెలకొంది. శనగ పంటలో అక్కడక్కడ ఉన్న శనగ బుడ్డలను పందులను తినేస్తున్నాయి. రబీ పంటలపై తుపాన్ ప్రభావం, పందుల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.


పందుల బెడద నుంచి పంటను కాపాడుకునేందుకు దిష్టిబొమ్మను పెట్టిన రైతు

దిగుబడులు దక్కే పరిస్థితి లేదు

రబీ పంటలలో దిగుబడులు దక్కే పరిస్థితి లేదు. రాత్రివేళల్లో అడవి పందులు పంటలపై పడి నాశనం వేయడంతోపాటు తినేస్తున్నాయి. పందులకు కాపలా వెళ్లలేక చలికి అల్లాడుతున్నాం. పందుల బెడద, వాతావరణ పరిస్థితులు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

– చలపతి(రైతు), వేముల



పంటలను కాపాడుకోలేకపోతున్నాం

రబీ పంటలను పందుల బెడద నుంచి కాపాడుకోలేకపోతున్నాం. రాత్రివేళల్లో తెల్లారేలోపు పంటలపై పందులు దాడి చేస్తున్నాయి. ఎప్పుడు వస్తాయో తెలియక పంటలను రక్షించుకునే మార్గం కానరాక ఇబ్బందులు పడుతున్నాం.

– వెంగల్‌రెడ్డి(రైతు), గొందిపల్లె

